ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ, ప్రాంతీయ వార్తలు

తేదీ: 23.07.2024 సమయం: 1500 గంటలు

ముఖ్యాంశాలు

1. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలు, వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్ ను ఈరోజు పార్లమెంట్ కు సమర్పించారు.
2. మూడు లక్షల రూపాయల వరకు ఎలాంటి పన్ను లేకుండా స్టాండర్డ్ డిడెక్షన్ ను 50 వేల నుంచి 75 వేల రూపాయలకు పెంచుతూ బడ్జెట్ లో పన్ను స్లాబులకు స్వల్ప మార్పులు చేశారు.
3. ముద్ర రుణాలను 10 లక్షల రూపాయల నుంచి 20 లక్షల రూపాయలకు పెంచడంతో పాటు, ఎమ్.ఎస్.ఎమ్.ఈ పథకాలకు క్రెడిట్ గ్యారంటీ పథకాన్ని కేంద్రం ప్రకటించింది.
4. కేంద్ర బడ్జెట్ సమాజంలోని అన్ని వర్గాల సాధికారతకు దోహద పడుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోది అన్నారు.
5. కంటోన్మెంట్ దివంగత శాసనసభ్యురాలు లాస్య నందితకు ఈరోజు ప్రారంభమయిన రాష్ట్ర శాసనసభ సంతాపం ప్రకటించింది.
6. భారీ వర్షాల వల్ల తెలంగాణాలో వివిధ నదులు, ప్రాజెక్టుల్లో వరద నీటి ఉధృతి కొనసాగుతోంది.

కేంద్ర బడ్జెట్

మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలు, వికసిత్ భారత్ లక్ష్యంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర వార్షిక బడ్జెట్ ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు పార్లమెంట్ కు సమర్పించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన – నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన – ఆవిష్కరణలు, తయారీ – సేవలు, కొత్త తరం సంస్కరణలు మొదలైన తొమ్మిది ప్రాధాన్యత అంశాల ఆధారంగా బడ్జెట్ ను రూపొందించినట్టు ఆర్థిక మంత్రి ప్రకటించారు.

(బైట్)

బడ్జెట్ లో కొత్త పన్ను విధానంలో పన్ను స్లాబ్ లకు స్వల్ప మార్పులు చేశారు. దీని ప్రకారం 3 లక్షల రూపాయల వరకు ఎలాంటి పన్ను వుండదు. మూడు లక్షల రూపాయల నుంచి 7 లక్షల రూపాయల వరకు 5 శాతం, 7 లక్షల రూపాయల నుంచి 10 లక్షల రూపాయల వరకు 10 శాతం, 10 లక్షల రూపాయల నుంచి 12 లక్షల వరకు 15 శాతం, 12 లక్షల రూపాయల నుంచి 15 లక్షల రూపాయల వరకు 20 శాతం, 15 లక్షల కంటే ఎక్కువ ఆదాయం వున్న వారికి 30 శాతం పన్ను వర్తిస్తుందని ఆర్థిక మంత్రి వివరించారు. స్టాండర్డ్ డిడక్షన్ 50 వేల రూపాయల నుంచి 75 వేల రూపాయలకు పెంచినట్టు చెప్పారు.

(బైట్)

మొబైల్ ఫోన్లు, మొబైల్ పి.సి.డి.ఏ, మొబైల్ ఛార్జర్లపై విధించే బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 15 శాతానికి తగ్గించారు. బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 6 శాతానికి, ప్లాటినమ్ పై దిగుమతి సుంకాన్ని 6.4 శాతానికి తగ్గించారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మూడు కోట్ల అదనపు ఇళ్లు నిర్మిస్తారు. పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణం కోసం వచ్చే ఐదేళ్ళలో 2.2 లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు.

ముద్రా రుణాలను 10 లక్షల రూపాయల నుంచి 20 లక్షల రూపాయలకు పెంచారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం క్రెడిట్ గ్యారంటీ పథకాన్ని తీసుకువస్తామని, దీని ద్వారా టర్మ్ లోన్లను జారీ చేస్తామని ఆర్థిక మంత్రి చెప్పారు. పారిశ్రామిక ప్రాంతాల్లో పని చేసే కార్మికుల కోసం అద్దె గృహాలను, పి.పి.పి విధానంలో డార్మిటరీ తరహా ఇళ్లను నిర్మిస్తారు.

బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి 1.52 లక్షల కోట్ల రూపాయలు, గ్రామీణాభివృద్ధికి 2.66 లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు. దేశ వ్యాప్తంగా కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికను అమలు చేస్తారు. ఐదు రాష్ట్రాల్లో కిసాన్ క్రెడిట్ కార్డులు, వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి లక్షన్నర కోట్ల రూపాయలు ప్రత్యేకించారు.

కొత్తగా 109 వంగడాలు ప్రవేశపెట్టామని, కూరగాయల ఉత్పత్తి కోసం ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని, నూనె గింజలు, పప్పు ధాన్యాల ఉత్పత్తి పెంచేందుకు కృషి చేస్తామని ఆర్థికమంత్రి తెలిపారు.

వచ్చే ఐదేళ్ళలో 20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తారు. 500 పెద్ద కంపెనీలలో ఇంటర్న్ షిప్ లు కల్పిస్తారు. దేశీయ విద్యా సంస్థల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు విద్యార్థులకు 10 లక్షల రూపాయల విద్యారుణాలు అందిస్తారు.

మహిళలు, బాలికల కోసం 3 లక్షల కోట్ల రూపాయలతో పథకాలు, విద్యా, ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి లక్షలన్నర కోట్ల రూపాయలు కేటాయించారు. మహిళల కోసం ప్రత్యేకంగా వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు ఏర్పాటు చేస్తామని ఆర్థికమంత్రి తెలిపారు. శ్రామిక శక్తిలో మహిళా భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు.

పూర్ణోదయ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ తో సహా, మరికొన్ని రాష్ట్రాలకు విస్తరిస్తున్నట్లు ఆర్థికమంత్రి తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి పూర్ణోదయ పథకం దోహద పడుతుంది.

మౌలిక సదుపాయాల కల్పనకు 11 లక్షల కోట్ల రూపాయలకు పైగా ప్రత్యేకించారు. ఇది జిడిపిలో 3.4 శాతానికి సమానం. రాష్ట్రాల మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు లక్షన్నర కోట్ల రూపాయల దీర్ఘకాల వడ్డీ లేని రుణాలు అందిస్తారు.

నిరుద్యోగులకు మూడు ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహకాలు ప్రకటించారు. సంఘటిత రంగంలో ఉద్యోగంలో చేరినవారికి ఒక నెల వేతనం మూడు వాయిదాల్లో గరిష్ఠంగా 15 వేల రూపాయలు చెల్లిస్తారు. ఇందుకు లక్ష రూపాయల లోపు నెల వేతనం వున్నవారు అర్హులు. దీని వల్ల 2 కోట్ల 10 లక్షల మంది యువతకు ప్రయోజనం కలుగుతుంది.

ఎంపిక చేసిన నగరాల్లో స్ట్రీట్ ఫుడ్ హబ్ లను ఏర్పాటు చేస్తారు. పి.ఎమ్.స్వనిధి కింద వంద నగరాల్లో ప్రత్యేక వారాంతపు సంతలు ఏర్పాటు చేస్తారు.

క్యాపిటల్ గెయిన్స్ విధానాన్ని సరళీకరించారు. దీర్ఘకాల లాభాలపై 12.5 శాతం పన్ను వుంటుంది. క్యాపిటల్ కనిష్ఠ పరిమితి లక్షా 25 వేల రూపాయలుగా నిర్ణయించారు. స్టార్టప్ లకు ప్రోత్సాహకంగా ఏంజెల్ టాక్స్ ను రద్దు చేశారు.

అంతరిక్ష రంగ సాంకేతిక అభివృద్ధి కోసం బడ్జెట్ లో వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించారు. వీటి ద్వారా ప్రభుత్వ గుర్తింపు పొందిన 180 కి పైగా స్పేస్ టెక్నాలజీ స్టార్టప్స్ కు సాయం లభిస్తుంది.

కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు వల్ల మందులు, వైద్య పరికరాలు, మొబైల్ ఫోన్లు, ఛార్జర్లు, సోలార్ ప్యానెళ్ళు, దిగుమతి చేసుకొనే బంగారం, వెండి, సముద్ర ఆహారం, లెదర్, టెక్స్ టైల్ ధరలు తగ్గే అవకాశం వుంది.

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను కొనసాగిస్తామని ఆర్థికమంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లను 300 యూనిట్ల ఉచిత సౌర విద్యుత్ ను అందించే లక్ష్యంతో కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.

కేంద్ర బడ్జెట్ ను 48.21 లక్షల కోట్ల పరిమాణంతో రూపొందించారు. మొత్తం ఆదాయం 32.07 లక్షలు కాగా, పన్ను ఆదాయం 28.83 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ద్రవ్యలోటు 4.3 శాతంగా వుండవచ్చునని అంచనా వేశారు. అప్పులు, పన్నేతర ఆదాయాలు 16 లక్షల కోట్ల రూపాయలుగా పేర్కొన్నారు.

నిర్మలాసీతారామన్ కేంద్ర ఆర్థిక మంత్రిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టడం వరుసగా ఇది ఏడవసారి. 2019 మే నుంచి నిర్మలా సీతారామన్ ఆర్థికమంత్రిగా కొనసాగుతున్నారు. అదే ఏడాది నరేంద్రమోది ప్రభుత్వం రెండవ సారి అధికారంలోకి వచ్చాక ఆమె తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్

ప్రవేశపెట్టారు. తరువాత వరుసగా 2020-21, 2021-22, 2022-23, 2023-24 బడ్జెట్ లతో పాటు, ఎన్నికల కారణంగా 2024-25 కి ఓటాన్ అకౌంట్ ను ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్ ను నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు.

ఎన్.ఎస్.డి. / డెస్క్

బడ్జెట్ తెలంగాణ

కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు ప్రత్యేకంగా ఎలాంటి నిధులు కేటాయించలేదు. అయితే ఆంధ్రప్రదేశ్ కు బడ్జెట్ లో ప్రత్యేక సహాయం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి 15 వేల కోట్ల రూపాయల ఆర్థిక సహాయం ఇస్తామని, అవసరాన్ని బట్టి మరిన్ని నిధులు కేటాయిస్తామని ఆర్థికమంత్రి చెప్పారు. విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని, రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు దీని కింద నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. హైదరాబాద్, బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, విశాఖ, చెన్నై పారిశ్రామిక కారిడార్ లోని భాగాలకు ప్రత్యేక సాయం అందిస్తామని ఆర్థిక మంత్రి చెప్పారు.

డెస్క్

పి.ఎమ్ రియాక్షన్

ఈరోజు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ సమాజంలోని ప్రతి వర్గానికి సాధికారతను, సహాయాన్ని అందజేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోది అన్నారు. గ్రామాల ప్రజలు, బలహీన వర్గాలు, రైతుల సౌభాగ్యానికి బడ్జెట్ మద్దతిస్తుందని ఆయన అన్నారు. కేంద్ర బడ్జెట్ పై వీడియో

సందేశం ఇస్తూ... యువతకు కూడా ఈ బడ్జెట్ మంచి అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. గత పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని నరేంద్రమోది పేర్కొన్నారు.

ఎన్.ఎస్.డి.

బడ్జెట్ రియాక్షన్స్

తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ కేంద్ర బడ్జెట్ ను ఉత్తమ బడ్జెట్ గా అభివర్ణించింది. పార్లమెంట్ లో బడ్జెట్ సమర్పణ అనంతరం ఫెడరేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్ సింఘల్ హైదరాబాద్ లో మాట్లాడుతూ... ఆత్మనిర్భర్ భారత్ దిశగా వేసిన ముందడుగుగా బడ్జెట్ ను అభివర్ణించారు. పరిశ్రమలకు ముఖ్యంగా ఉత్పాదక రంగానికి, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల రంగానికి ఈ బడ్జెట్ సానుకూలంగా వుందన్నారు.

(సౌండ్ బైట్  సురేష్ కుమార్ సింఘల్)

FTCCI మహిళా కమిటీ అధ్యక్షులు భగవతి మాట్లాడుతూ... ఈ బడ్జెట్ మహిళలు, యువత, రైతులకు అత్యంత ప్రోత్సాహకాలు ప్రకటించిందని పేర్కొన్నారు.

(సౌండ్ బైట్ భగవతి)

ఛార్టడ్ అకౌంటెంట్ సుధీర్ మాట్లాడుతూ... ఉద్యోగులకు, పరిశ్రమలకు పన్ను రాయితీలు ప్రోత్సహకంగా వున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

(సౌండ్ బైట్ సుధీర్)

ఎమ్.ఎస్.ఎల్

శాసనసభ

రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. నేడు మొదటి రోజు దివంగత శాసన సభ్యురాలు  లాస్య నందితకు సభ సంతాపం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీర్మానం ప్రవేశపెడుతూ... లాస్య నందిత, ఆమె తండ్రి సాయన్న ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచి వున్నారని పేర్కొన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి వీరిద్దరు చేసిన కృషిని ఆయన గుర్తు చేసుకున్నారు. వారి ఆశయ సాధన కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జి.హెచ్.ఎమ్.సిలో కలపాలన్న కోరిక ప్రస్తావిస్తూ... ప్రస్తుత తరుణంలో వీరిద్దరు జీవించిలేకపోవడం పట్ల ఆయన బాధను వ్యక్తం చేశారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, బి.ఆర్.ఎస్ సభ్యులు కె.తారక రామారావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సునీతా లక్ష్మారెడ్డి సహా పలువురు విపక్ష సభ్యులు సంతాప తీర్మానంపై ప్రసంగించారు.  బిజెపి శాసనసభాపక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, సభ్యులు పాయల్ శంకర్ సహా, సి.పి.ఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు సహా పలువురు సభ్యులు సంతాపం తీర్మానంపై ప్రసంగించారు. కాగా, బిజెపి సభ్యులు ఈ ఉదయం ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం నుంచి శాసనసభకు పాదయాత్రగా వచ్చారు. రైతుల రుణ మాఫీ అంశంపై ప్రభుత్వ తీరు మభ్యపెట్టేదిగా వుందని ఆరోపిస్తూ... రైతులకు మద్దతుగా పాదయాత్ర నిర్వహించారు. బి.ఆర్.ఎస్ సభ్యులు కూడా గన్ పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించి, సమావేశాలకు హాజరయ్యారు.

ఎమ్.ఎస్.ఎల్

యాడ్ అసెంబ్లీ

కాగా, శాసనసభ సమావేశాలు ఈ నెల 31వ తేదీ వరకు జరగనున్నాయి. ఎల్లుండి ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెడతారు.

అనౌన్స్ మెంట్

కేంద్ర బడ్జెట్ పై ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం ఈ రాత్రి 7 గంటల 30 నిముషాలకు చర్చా కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. FTCCI కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గరిమెళ్ళ, ఆర్థిక నిపుణులు పాపారావు, ఆర్థిక శాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్ Dr. మహమ్మద్ అబ్దుల్ మాలిక్ చర్చలో పాల్గొంటారు.

డెస్క్